క్లుప్తంగా

నోటి ఆరోగ్యంపై అవగాహన

పొదలకూరు : ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీని నిర్వహించారు. పంటి సంరక్షణకు సంబంధించి పలు సూచనలు జారీ చేశారు. అనంతరం టూత్ పేస్టులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాధా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించాలి



నారికేళపల్లిలో మూతపడిన ఆర్వో ప్లాంట్

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఆర్వో ప్లాంటు కొద్దిరోజులుగా మూతపడింది. ఇక్కడి రక్షిత తాగునీటి పథకం కూడా వినియోగంలోకి రాలేదు. దీంతో ఈ ప్రాంత పేద కుటుంబాలు తాగునీరును అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఆర్వో ప్లాంటును కృష్ణపట్నం పోర్టు నిర్వాహకులు గతంలో ఏర్పాటు చేశారు. అయితే, గత సంవత్సరం వచ్చిన గాలివానకు ఈ ప్లాంటుపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో ప్లాంటు పరికరాలు చెడిపోయాయి. అయితే, చెడిపోయిన పరికరాలను బాగు చేసినప్పటికీ ప్లాంటు మాత్రం వినియోగంలోకి రాలేదు.

ఫిషింగ్ జెట్టీ పరిశీలన



పరిశీలిస్తున్న సోమిరెడ్డి

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, నేలటూరు సముద్ర తీరాన గత సంవత్సరం అదానీ కృష్ణపట్నంపోర్టు తలపెట్టిన ఫిషింగ్ జెట్టీ పనులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ జెట్టీ నిర్మాణం పూర్తయ్యేందుకు అవసరమైన అదనపు నిధులను ఏపీ మారిటైమ్ బోర్డు భరిస్తుందన్నారు. పోర్టు ప్రతినిధి గంటా వేణు గోపాల్, నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.60 వేల వితరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు పట్టణానికి చెందిన సుధాకర్‌రెడ్డి, స్వప్న దంపతులు బుధవారం రూ.60 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి శ్రీవార్ల దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందిపై చర్యలేవీ..?

రాపూరు: వెలుగు కార్యాలయంలో నిధులను స్వాహా చేసిన సిబ్బందిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రూ.1.41 కోట్ల నిధుల గోల్‌మాల్ జరిగినట్టు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో తొమ్మిది మంది డీఆర్‌డీఏ సిబ్బందిపై విచారణకు ఆదేశించారని తెలిపారు. యానాది సమాఖ్య, మహిళా సమాఖ్యలో విచారణ జరిపి ఏడుగురు సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు డీఆర్‌డీఏ పీడీకి నివేదిక అందించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద ఈ నెల ఏడున నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుమన్, జిల్లా కోశాధికారి పెంచలప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతలు హరినారాయణ, నాగయ్య, ప్రసన్నకుమార్ రెడ్డి, సురేష్, భాస్కర్, వెంకటేష్, సునీల్, మనోజ్‌కుమార్‌యాదవ్, లోకేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

తోటపల్లిగూడూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా చెత్తదిబ్బలు



నరుకూరు సమీపంలో ఇలా..



ప్రజారోగ్యానికి, పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు గొప్పలకు పోయే పాలకుల మాటలు వాస్తవ రూపంలో నీటిమూటలేనని తేలిపోతోంది. గ్రామాల్లోని వీధుల వెంట చెత్త కుప్పలు, మురుగు కాలువల్లో పేరుకుపోతన్న వ్యర్థ జలాలతో దోమల ఉధృతి పెరిగి స్థానికులు పలు రోగాలకు గురవుతున్నారు.

- ప్రకటనలకే పరిమితమైన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్
- చెత్త బుట్టల పంపిణీ ఎన్నడో?
- మురికికూపాలుగా మారుతున్న పల్లెలు
- ఇబ్బందుల్లో గ్రామీణులు

తోటపల్లిగూడూరు : ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పల్లెల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడం వాటిని ఎప్పటికప్పుడు బయట ప్రాంతాలకు తరలించి పరిశుభ్రతకు కృషి చేయాలనేది కార్యక్రమ లక్ష్యం. ఇందుకోసం నెలలో మూడో శనివారం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నరుకూరు పంచాయతీ నుంచి స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీధులను ఊడ్చి పరిశుభ్రతకు పాటు పడాలని అధికారులు, పార్టీ నాయకులకు సూచించారు. అంతేకాక సచివాలయాల సిబ్బంది ఒక్కొక్కరూ రెండు మొక్కల చొప్పున, ప్రతి ఇద్దరు అధికార పార్టీ నాయకులు పది మొక్కల చొప్పున నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు అందరితో ప్రమాణం చేయించారు. అయితే కార్యక్రమం చేపట్టి నెల రోజులు దాటినా ఎమ్మెల్యే చెప్పిన పనులేవి గ్రామాల్లో సాగడం లేవని సాక్షాత్తు గ్రామ సర్పంచ్‌లే చెబుతున్నారు.

దోమల దండయాత్ర

సంపూర్ణ పరిశుభ్రత విషయంలో పాలకులు, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామీణ ప్రాంతాలు మురికికూపాలుగా మారుతున్నాయి. రోజుల తరబడి గుంతల్లో మురికిని తీయకపోవడం, ఒకవేళ తీసినా మురుగు దిబ్బలను వారాల తరబడి బయటకు తరలించడం లేదు. దీంతో పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించి దోమల దండయాత్రలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలు గ్రామాల్లో అంటు వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.

ఎప్పుడిస్తారో..

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ విజయవంతంగా సాగాలంటే వీధుల్లో చెత్త చెదారాలను వేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి రెండు డస్ట్‌బిన్స్ అందిస్తున్నామని ప్రకటించింది. అయితే డస్ట్‌బిన్స్ పంపిణీ హామీ ప్రకటనలకే పరిమితమైంది. మండలంలోని 16,500 కుటుంబాలు రెండు డస్ట్‌బిన్స్ చొప్పున పంపిణీ చేయాలంటే 33 వేల డస్ట్‌బిన్స్ అవసరం. అయితే ప్రభుత్వం ఎన్నింటిని పంపిందో మండలాధికారుల వద్దే లెక్కలు లేవు. కొన్ని పంచాయతీ కార్యాలయాలకు ఇంత వరకు చేరనే లేదు. కొన్ని పంచాయతీలకు చేరినా అరకొరగా రావడంతో పంపిణీకి నోచుకోక సచివాలయాల గదులకే పరిమితమయ్యాయి.

డస్ట్‌బిన్స్ చేరలేదు


కొన్ని పంచాయతీలకు డస్ట్‌బిన్స్ చేరినట్లు తెలిసింది. అయితే మా పంచాయతీకి మాత్రం ఇంతవరకు చేరలేదు. మా పంచాయతీకి సంబంధించి 700కుపైనే కుటుంబాలు ఉన్నాయి. ఈ క్రమంలో దాదాపు 1,400 డస్ట్ బిన్స్ అవసరం.

– కాల్తిరెడ్డి సుబ్బారావు, సర్పంచ్, మండవం పంచాయతీ

వివరాలు అందాల్సి ఉంది

మండలానికి సంబంధించి ఎన్ని డస్ట్ బిన్స్ అవసరం, ఏ మేర వచ్చాయో వివరాలు పూర్తిగా అందుబాటులో లేవు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలను అందిస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, తోటపల్లిగూడూరు



కోడూరు ముక్కంటమ్మకాలనీ వద్ద కాలువలో పారని మురుగు



మండల కార్యాలయం ఎదుట అపరిశుభ్ర ప్రదేశంలో తాగునీటి కుళాయి

ఈఓపీఆర్డీ, కార్యదర్శిపై విచారణ నేడు

కోవూరు : కోవూరు ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలపై కోవూరు పంచాయతీ పాలకవర్గ సభ్యులు కొందరు నెల్లూరు డీపీఓ శ్రీధర్‌రెడ్డికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం కోవూరులో విచారణ చేస్తున్నట్లు డీఎల్‌పీఓ రమణయ్య బుధవారం తెలిపారు. ఈ విచారణ నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు.

కల్వర్టు నిర్మాణానికి చర్యలు

- పీఆర్ ఏఈ గోపీచంద్



కల్వర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లో ఉన్న గుడిపల్లికాలువ కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ గోపీచంద్ తెలిపారు. కల్వర్టు నిర్మాణ ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణానికి రూ.4.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక ప్రజలు ఏఈని కోరారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు : మండలంలోని వేగూరు గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో రీసర్వేకు సంబంధించిన అవగాహన ర్యాలీని అధికారుల బృందం బుధవారం సాయంత్రం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగూరు పంచాయతీకి సంబంధించి ఏయే ప్రాంతాల్లో రీసర్వేను ప్రారంభిస్తారో రెండు రోజుల ముందుగానే రైతులకు సమాచారం ఇస్తారన్నారు. రైతులు హాజరై తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో సమాచారం ఇవ్వాలన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ నాజర్, ఎలక్షన్ డీటీ రవి, సర్వేయర్ రమేష్ యాదవ్, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పొదలకూరు : మండలంలోని గురవాయపాళెం గ్రామంలో మూడురోజుల పాటు జరిగే కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ నుంచి దేవస్థానం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు గ్రామస్తులు వెల్లడించారు. దీంతో పాటు భక్తులు చందాలు పోగుచేసి నిర్మాణాన్ని పూర్తిచేశారు. తొలిరోజున ప్రత్యేక పూజలు, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన గావించారు. విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా ఉంటుందని తెలిపారు. అదేరోజు ఉదయం 10.30 గంటలకు కోదండరామస్వామి కల్యాణం కనులవిందుగా జరుగుతుందన్నారు. మూడురోజుల పాటు భక్తులకు నిత్యాన్నదానం ఉంటుందని తెలిపారు.

ఆటిజం ఉంటే భవిత కేంద్రంలో చేర్పించాలి



కొడవలూరులో ఆటిజంపై అవగాహన ర్యాలీ

కొడవలూరు : ఆటిజం సమస్య ఉన్న పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని హెచ్ఎం కేవీ సత్యనారాయణరావు కోరారు. ఆటిజం డే సందర్భంగా స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో కొడవలూరు హైస్కూల్ విద్యార్థులతో గ్రామంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుకు తగ్గ మానసిక ఎదుగుదల లేని సమస్యను ఆటిజంగా పేర్కొంటారన్నారు. ఇలాంటి పిల్లలకు భవిత కేంద్రం అండగా నిలుస్తుందని చెప్పారు. మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మానసిక ఎదుగుదల లేని పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించడం ద్వారా వారు మానసికంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మి, భవిత కేంద్రం ఐఈఆర్టీలు ఎం.సునీత, టి.హైమావతి, ఉపాధ్యాయుడు పురుషోత్తం పాల్గొన్నారు.

‘టీడీపీ సర్పంచ్ దౌర్జన్యం చేస్తున్నారు’

- న్యాయం చేయాలని రైతు వేడుకోలు



మాట్లాడుతున్న రైతు కల్యాణ్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ గ్రామంలో టీడీపీ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోయాయని కల్యాణ్ అనే రైతు వాపోయారు. ఈ మేరకు ఆయన గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తన పొలానికి వెళ్లనివ్వకుండా బాట మార్గాన్ని జేసీబీతో తవ్వించి దాడికి పాల్పడ్డారని తెలిపారు. గతంలో కందికట్టు పెంచలయ్య ద్వారా రెండెకరాలను ఎకరా రూ.17 లక్షల లెక్కన కొన్నామన్నారు. అప్పటి నుంచి పొలం సాగు చేసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం తాను స్థానికంగా ఉండకపోవడంతో తన తండ్రి పొలాన్ని సాగు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ సర్పంచ్ పెంచలయ్య తన తండ్రిని పొలానికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. పొలానికి వెళ్లే బాట జేసీబీతో ఎలా ధ్వంసం చేయిస్తావని ప్రశ్నించినందుకు టీడీపీ నేత పారతో తనతో పాటు తన తండ్రిపై దాడి చేసేందుకు యత్నించి, దుర్భాషలాడారని తెలిపారు. ఎట్టి పరిస్థితిలో పొలానికి దారి ఇవ్వమని, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించారని బాధితుడు వాపోయారు. ఈ విషయమై అధికారులకు తెలియజేశామన్నారు. అధికారులు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని, న్యాయం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ప్రసన్న నివాళి



సునీల్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, విజయ డెయిరీ మాజీ డైరెక్టర్ ఇసనాక సునీల్ కుమార్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. యల్లాయపాళెంలోని వారి నివాసంలో జరిగిన ఉత్తరక్రియలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి బుధవారం హాజరయ్యారు. సునీల్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు దేవిరెడ్డి సాయి రెడ్డి, జడ్డా సాయికుమార్, సమీఉద్దీన్ తదితరులున్నారు.

చిల్డ్రన్స్ పార్కులో మెరుగైన వసతులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో మరింత మెరుగైన వసతులను కల్పించనున్నామని కమిషనర్ సూర్యతేజ వెల్లడించారు. పార్కును బుధవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడికి విచ్చేసే వారికి అవసరమైన మరుగుదొడ్లు, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా వ్యాయామ పరికరాలు, షటిల్, ఇతర క్రీడా సౌకర్యాలను ప్రత్యేక ప్రాంగణంలో కల్పించేలా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 48.399 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 48.399 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



పార్టీ నాయకులతో ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కలసికట్టుగా కృషి చేయాలని మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచించారు. ఇటీవల నియమించిన కోవూరు నియోజకవర్గ కమిటీ, మండల కమిటీ, టౌన్ కమిటీ సభ్యులతో కోవూరు మండల కేంద్రంలోని పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అతిథి గృహంలో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, మీరా రెడ్డి, రవి, గయాజ్, జుబేర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం : ప్రముఖ కవి కాంజీవరం రాధాకృష్ణ సామాజిక నైతిక విలువలను బోధిస్తూ రాసిన ‘మారకనే మారానంటాడు’ అనే పుస్తకాన్ని కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో బుధవారం వీసీ అల్లం శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తన మనసులోని భావాలను కవితాత్మకంగా వ్యక్తం చేసిన ఈ సంపుటిని అందరూ చదవాలని కోరారు. ఈ సందర్భంగా కాంజీవరం రాధాకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, డాక్టర్ సి.రాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా అందజేశామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు వీటిని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి 1,19,724 నోట్, 11,601 పాఠ్య పుస్తకాలను అందజేశామని వెల్లడించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, అధ్యాపకులు చంద్రకళ, వెంకట్రావు, శ్రీదేవి, సమత, విజయలక్ష్మి, పూర్ణచంద్ర కుమారి, కృష్ణతులసి, పెంచలనరసయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.